

నృసింహస్వామికి మొక్కులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి వారికి భక్తులు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరిలో స్నానాలు చేసి స్వామివారలను దర్శించుకున్నారు.



ఎడ్ల నాగలికి భలే గిరాకీ

వ్యవసాయంలో ట్రాక్టర్లు, ఆధునిక యంత్రాలు రావడంతో కాడెద్దులు కనుమరుగయ్యాయి. గ్రామానికి కేవలం ఐదారు జతల కాడెద్లు మాత్రమే ఉన్నాయి. -8లో▸

గరిష్టం/కనిష్టం
38.0/27.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- కలెక్టర్ సత్యప్రసాద్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలరూరల్: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరం కృషిచేద్దామని కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. మత్తుపదార్థాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఎస్పీ కార్యాలయంలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. మత్తు పదార్థాల నివారణకు విద్యార్థులు, యువత కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. యువత, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ముందుగా ఎస్పీ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలలు, కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీం రావు, డీఎస్పీ రఘుచందర్, సీఐలు కిరణ్‌కుమార్, వేణు, సైదులు, శ్రీనివాస్, ఆరీఫ్ అలీఖాన్, కరుణాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు పరిష్కరిస్తాం



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 21 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారితో నేరుగా మాట్లాడిన ఆయన.. సమస్యలను వెంటనే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను వెంటవెంటనే పరిష్కరించేలా కృషి చేస్తున్నామని వివరించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంక్ సాధించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లా మెరుగైన ర్యాంక్ సాధించాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. కేంద్ర గ్రామీణ, పారిశుద్ధ్య మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలవారీగా స్వచ్ఛత స్థాయిని అంచనా వేస్తారని, గణాంకాలు, నాణ్యత ఆధారంగా ర్యాంక్‌లు ఇస్తారని వివరించారు. గ్రామాల్లో శుభ్రత, ఎస్‌బీఎంజీ ద్వారా సాధించిన విజయాలు, సేవస్థాయి పురోగతి, వ్యర్థ నిర్వహణ కేంద్రాలు, ఓడీఎఫ్ మారుతుంటాయని పేర్కొన్నారు. అధికారులంతా కలిసికట్టుగా మార్కులు సాధించి జిల్లాను మొదటిస్థానంలో నిలపాలని కోరారు. డీఆర్డీఏ పీడీ రఘువరణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

జగిత్యాలటౌన్: మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జగిత్యాల డిపో మేనేజర్ కల్పన సోమవారం తెలిపారు. ప్రయాణికులు తమ సందేహాలు, సలహాలు, సూచనలను 99592 25925 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని సూచించారు.

పోలీసులపై మాజీమంత్రి వ్యాఖ్యలు సరికాదు

జగిత్యాలక్రైం: మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ పోలీసులపై చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.గోపిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 'లంచం తీసుకోకుంటే పోలీసులకు నడవదా..? పోలీసులేమీ సుద్దపూసలు కాదు. బల్లకింద చేయి పెట్టకుంటే వారికి నడవదు..' అని వ్యాఖ్యానించడం సరికాదని పేర్కొన్నారు. తమ పార్టీ నాయకులపై దృష్టి పెడితే ఒక్క పోలీసు విధుల్లో ఉండడనే బెదిరింపు ధోరణిలో మాట్లాడటాన్ని ఖండించారు. అక్రమ దందాలు, అవినీతిని అరికట్టడంలో.. శాంతిభద్రతల విషయంలో అంకితభావంతో పనిచేస్తున్నామని, ప్రజలకు అండగా నిలవడంలో ఎప్పుడూ వెనుకడుగు వేయబోరని, అలాంటి పోలీస్‌లపై ఇలాంటి వ్యాఖ్యలు సరికాదని పేర్కొన్నారు.

చినుకు చిన్నబోయింది..

- చిరుజల్లులకే పరిమితం
- మొలకెత్తని విత్తనాలు
- అష్టకష్టాలు పడుతున్న రైతులు
- భారీ వర్షం కోసం ఎదురుచూపు
- జూలైపైనే అన్నదాతల ఆశలు



వర్షాలు కురవకపోవడంతో డ్రిప్ ద్వారా నీరు అందిస్తున్న రైతు

జగిత్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్ ప్రారంభమైంది. జూన్ నెల చివరికి వచ్చినా ఇప్పటివరకు పెద్ద వర్షం జాడ లేకుండాపోయింది. కేవలం చిరుజల్లులకే పరిమితం అవుతుండటంతో రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు కొద్దిరోజులుగా పొడి వాతావరణంతోపాటు 36 నుంచి 38 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ఏడాది 15 రోజులు ముందుగానే రుతుపవనాలు రావడం.. వర్షాలు ఓ మోస్తరుగా కురవడం, బావుల్లో ఉన్న నీటితో పంట పండించుకోవచ్చనే ఆశతో రైతులు అక్కడక్కడ పసుపు, పెసర, మొక్కజొన్న, కంది, పత్తి విత్తనాలు వేశారు. మరికొన్ని చోట్ల వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం.. పొడి వాతావరణం కారణంగా భూమిలో తేమ ఆవిరై విత్తనాలు మొలకెత్తే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గాలిలో తేమ శాతం పెరగడంతో ఉక్కపోత మొదలైంది.

వర్షపాతం అంతంతే..

జిల్లాలో జూన్ 23 వరకు సాధారణ వర్షపాతం 115.2 మిల్లీమీటర్లు. కానీ.. ఇప్పటివరకు 78.1 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైంది. సాధారణ వర్షపాతంతో పోల్చితే ఇది 37.1 మిల్లీమీటర్లు తక్కువ. 15 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. అది కూడా చిరుజల్లులకే పరిమితమైంది. రెండు, మూడు రోజులకోసారి 2 నుంచి 4 మిల్లీమీటర్ల మేర తేలికపాటి వర్షాలు కురవగానే రైతులు విత్తనాలు వేశారు. అవి ఇప్పుడు మొలకెత్తడం లేదు. జిల్లాలో సాధారణ వర్షపాతంలో పోల్చితే జగిత్యాలలో 34 శాతం, జగిత్యాల రూరల్‌లో 16, రాయికల్‌లో 24, సారంగాపూర్‌లో 13, మల్యాలలో 25, పెగడపల్లిలో 51, కొడిమ్యాలలో 26, కోరుట్లలో 24, మేడిపల్లిలో 50, మెట్‌పల్లిలో 47, ఇబ్రహీంపట్నంలో 32, బుగ్గారంలో 50, ధర్మపురిలో 34, బీర్‌పూర్‌లో 59, గొల్లపల్లిలో 54, వెలగటూర్‌లో 41, ఎండపల్లిలో 51, మల్లాపూర్‌లో 19, భీమారంలో 21 శాతం చొప్పున తక్కువ వర్షపాతం నమోదైంది. కథలాపూర్‌లో సాధారణ వర్షపాతం పడింది. వాస్తవానికి నైరుతి రుతుపవనాలతో జూన్ 15 నుంచి సెప్టెంబర్ వరకు వర్షాలు కురుస్తాయి. ఈ ఏడాది జూన్ ప్రారంభంలోనే వర్షాలు కురవడంతో రైతులు విత్తనాలు వేశారు.

డ్రిప్ ద్వారా పంటలకు నీరు

భూమిలో తేమ లేక విత్తనాలు మొలకెత్తకపోవడం, మొలకెత్తినని మాడిపోతుండటంతో రైతులు పంటలకు నీరు అందించే పనులు ప్రారంభించారు. పసుపు, మొక్కజొన్న వంటి తోటలకు డ్రిప్, మిగతా అరుతడి పంటలకు వ్యవసాయ బావుల ద్వారా నీరు అందిస్తున్నారు. కొంతమంది రైతులు ఇంకా విత్తనాలు వేయాల్సి ఉంది. వారంతా వర్షాల కోసం వేచి చూస్తున్నారు. నిజానికి జూలైలో ఎక్కువ వర్షాలు కురుస్తుంటాయి. దీంతో రైతులు జూలైలో వర్షాలపైనే నమ్మకం పెట్టుకున్నారు. బావుల్లోని నీటితో వరి నారు పెంచుతున్నారు.

వర్షం కోసం చూస్తున్నాం



జిల్లాలో పెద్ద వర్షం ఇప్పటికి ఒక్కటీ లేదు. చిరుజల్లులకే పరిమితం అయ్యాయి. అదును దాటిపోతుందని బావిలో నీరు ఉండటంతో రెండు ఎకరాల్లో పసుపు, మొక్కజొన్న విత్తనాలు వేశాను. ఆ విత్తనాలను కాపాడుకునేందుకు ఆకాశం వైపు చూస్తూనే.. డ్రిప్ ద్వారా నీటిని అందిస్తున్నాను.

– ఏలేటి స్వామిరెడ్డి, శ్రీరాములపల్లె

జూలైలో వర్షాలు కురిసే అవకాశం



జూన్‌లో అంతంతమాత్రంగానే వర్షపాతం నమోదైంది. జూలైలో వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం ఉంది. తేలికపాటి నేలల్లో విత్తనాలు వేసిన రైతులు నీటిని అందించడం మంచిది. వాతావరణంలోని మార్పులతో వర్షాలు కురవడంతో కొంత ఆలస్యం అవుతోంది.

– శ్రీలక్ష్మి, వాతావరణ శాస్త్రవేత్త, పొలాస

ప్రజావాణికి వినతుల వెల్లువ



జగిత్యాలటౌన్: కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బాధితుల నుంచి కలెక్టర్ సత్యప్రసాద్ అర్జీలు స్వీకరించారు. 61 మంది వివిధ సమస్యలతో కలెక్టరేట్‌కు వచ్చారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదనపు కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్‌గౌడ్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



డబుల్ ఇళ్లు ఇప్పించండి

మాది కోరుట్లలోని అల్లమయ్యగుట్ట ప్రాంతం. మాకు గత ప్రభుత్వం నివేశన స్థలాలు ఇచ్చి పట్టాలు పంపిణీ చేసింది. స్థలం కేటాయిలుంచిన ప్రభుత్వం ఇప్పటివరకు నిర్మాణం ప్రారంభించ లేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని మాకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వండి.

డబ్బులు ఇప్పించండి



ఎలగందుల కొమిరెల్లి

మాది బుగ్గారం మండలం వెల్గొండ. నాకు ఉన్న ఆటోను గతంలో రంగపేటలో ఏఈవో పనిచేసిన ముత్యాల మల్లేశం అద్దెకు తీసుకున్నాడు. దాని అద్దె రూ.32వేలు ఇవ్వ లేదు. అడిగితే బెదిరిస్తున్నాడు. నా డబ్బులు నాకు ఇప్పించి ఆదుకోండి.

భూములపై హక్కులు కల్పించండి



గోండు ప్రతినిధులు, చిన్నకొల్వాయి

మాది బీర్‌పూర్ మండలం చిన్నకొల్వాయి గ్రామం. గోండు జాతికి చెందిన మాకు 1990లో ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూమిని అప్పటి కరీంనగర్ డీఆర్‌డీఏ చిన్నకొల్వాయి శివారులో కేటాయించారు. సాగు చేసుకుంటున్న ఆ భూమిని కొందరు బీసీ కులస్తులు అడ్డుకుంటున్నారు. మాకు న్యాయం చేయండి

పెన్షనర్లలో చీలిక తగదు



– విశ్రాంత ఉద్యోగులు

పార్లమెంట్‌లో ఈ ఏడాది మార్చితో తీసుకొచ్చిన పెన్షన్ సవరణ చట్టం రద్దు చేయాలి. పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతారు. ఆ చట్టం ప్రకారం పెన్షనర్లకు భవిష్యత్తులో పెన్షన్ పెంపు ఉండదు. ఆ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి.

పెన్షన్ రావడం లేదు



మాది కథలాపూర్ మండలం తాండ్ర్యాల. వందశాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఉంది. అయినా అధికారులు పింఛన్ మంజూరు చేయడం లేదు. రెండేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

– పానుగంటి భాస్కర్, తాండ్ర్యాల

చెరువులు, కుంటలను కాపాడండి



గంగపుత్రులు

మేం గంగపుత్రులం. జిల్లాకేంద్రం శివారులో ఉన్న చెరువులు, కుంటలను కాపాడండి. లింగం చెరువు నుంచి చింతకుంటకు వచ్చే నాలాను కొందరు కబ్జా చేసి గోడ నిర్మిస్తున్నారు. నాలా లేకుంటే వర్షం కురిసినప్పుడు లోతట్టు ప్రాంతాలు మునిగిపోతాయి. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

పడిపోయిన ఏఎస్సై తాజొద్దీన్



వీల్‌చైర్‌లో తాజొద్దీన్

ప్రజావాణిలో అపశృతి చోటుచేసుకుంది. పట్టణ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై తాజొద్దీన్ తీవ్ర అస్వస్థతకు లోనై వేదికవద్దే సొమ్మసిల్లిపడిపోయాడు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా వివరాలు అడిగేందుకు తాజొద్దీన్‌ను అదనపు కలెక్టర్ బీఎస్.లత వేదిక వద్దకు రావాలని సూచించారు. అక్కడ స్వల్ప అస్వస్థతకు గురైన ఆయన అకస్మాత్తుగా కింద పడిపోయాడు. వెంటనే సిబ్బంది అతడిని ఆస్పత్రికి తరలించారు.

పనులు నాణ్యతతో చేయాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: అభివృద్ధి పనులను నాణ్యతతో చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని 30వ వార్డులో రూ.13 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు సోమవారం భూమిపూజ చేశారు. పనుల్లో అక్కడక్కడ నాణ్యత లోపిస్తోందని, అలా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అనంతరం పట్టణంలోని 126 మందికి రూ.98.11 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మోతె చెరువు అభివృద్ధికి రూ.3.50 కోట్లు, కండ్లపల్లి చెరువుకు రూ.3 కోట్లు, తిప్పన్నపేట బ్లాక్ స్పాట్ రోడ్‌కు రూ.10 కోట్లు, ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో 10 లక్షల లీటర్ల వాటర్‌ట్యాంక్‌కు రూ.2 కోట్లు మంజూరయ్యాయన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గిరి నాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ ఎల్లారెడ్డి, అడువాల లక్ష్మణ్, తహసీల్దార్ రాంమోహన్ ఉన్నారు.

హరితకుండీల నుంచి చెత్త తొలగింపు



కుండీల నుంచి చెత్త తొలగిస్తున్న బల్దియా సిబ్బంది

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన హరిత కుండీల్లో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. కుండీల్లో చెత్త పేరుకుపోవడంతో 'చెత్త కుండీల్లా హరిత కుండీలు' శీర్షికన 'సాక్షి' సోమవారం కథనం ప్రచురించిన విషయం తెల్సిందే. ఈ కథనానికి బల్దియా కమిషనర్ స్పందన స్పందించారు. పట్టణంలోని హరితకుండీల్లో పేరుకుపోయిన చెత్తను బల్దియా సిబ్బంది తొలగించారు.

పోలీసు బదిలీ'లీల'లు

- మార్పులు..చేర్పులు తప్పవా..?
- ఐదు రోజులు గడిచినా వీడని అస్థిరత

కోరుట్ల: జిల్లాలో పోలీసు బదిలీల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. కనీసం రెండేళ్ల కాలవ్యవధి, పరిధులు దాటి సివిల్ పంచాయితీలు, అవినీతి వంటి ఫిర్యాదులు వచ్చినప్పుడు పోలీసు శాఖలో బదిలీలు సాధారణం. అలాంటి పరిస్థితులను పక్కనబెట్టి అధికార పార్టీ నేతలు చెప్పిన వారికే ప్రాధాన్యం ఇస్తూ.. సాధారణ నిబంధనలు పట్టించుకోకుండా జరుగుతున్న బదిలీలు చర్చకు దారితీస్తున్నాయి. నెలక్రితం జిల్లాకేంద్రానికి బదిలీ అయిన డీఎస్పీ పోస్టింగ్ ఉత్తర్వులు రద్దయ్యాయి. ఎందుకు పోస్టింగ్ ఇచ్చారో..? ఎందుకు రద్దు చేశారో..? అని పోలీసు, రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఐదురోజుల క్రితం జిల్లాలోని కొంతమంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడగా.. ఇందులోనూ మార్పులు, చేర్పులు జరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

మళ్లీ మార్పులు..?

ఈనెల 19న జిల్లాలో ఎస్సై స్థాయి బదిలీలు జరిగాయి. జగిత్యాల టౌన్ ఎస్సై గీతను సారంగాపూర్‌కు, ధర్మపురి ఎస్సైని వెల్గటూర్‌కు, కోరుట్ల ఎస్సై శ్రీకాంత్, సారంగాపూర్ ఎస్సై దత్తాద్రి, గొల్లపల్లి ఎస్సై సీహెచ్.సతీష్‌ను జగిత్యాల డీఎస్పీకి, వెల్గటూర్ ఎస్సై ఉమాసాగర్‌ను జగిత్యాల వీఆర్‌కు, నిజామాబాద్ జిల్లా నందిపేట ఎస్సై చిరంజీవిని కోరుట్లకు, నిర్మల్ జిల్లా కడెం ఎస్సై కృష్ణసాగర్‌ను గొల్లపల్లికి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం ఇప్పటివరకు పోస్టింగ్ ఇచ్చిన ఠాణాల్లో ఎవరూ విధుల్లో చేరలేదు. కేవలం నందిపేట నుంచి కోరుట్లకు వచ్చిన ఎస్సై చిరంజీవి మాత్రం మంగళవారం జాయిన్ అవుతున్నట్లు సమాచారం. ఐదురోజుల క్రితం జారీ అయిన బదిలీ ఉత్తర్వుల్లో మళ్లీ కొంత మేర మార్పులు చోటు చేసుకుంటున్నట్లు పోలీసు వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

రాజకీయ ఒత్తిళ్లు కారణమా..?

ఐదురోజుల క్రితం జిల్లాలోని కొంత మంది ఎస్సైల బదిలీ ఉత్తర్వులు రావడానికి రాజకీయ నాయకుల ప్రమేయం ఎక్కువగా ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ బదిలీల్లో మళ్లీ కొంతమంది ఎస్సైల బదిలీ పోస్టింగ్‌ల ఉత్తర్వులు మార్చాలని రాజకీయంగా పోలీసు అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ధర్మపురి, వెలగటూర్, గొల్లపల్లి ఎస్సైల బదిలీ ఉత్తర్వుల్లో మార్పులు చోటుచేసుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీని ప్రభావం మిగిలిన పోస్టింగ్‌లపైనా ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. ఫలితంగా ఐదు రోజుల క్రితం వచ్చిన ఉత్తర్వుల అమలు పూర్తిస్థాయిలో జరగడం కష్టమేనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరో పదిహేను రోజుల్లో జిల్లాలో మరికొంత మంది ఎస్సైల బదిలీలు జరగనున్నాయి. మొత్తంగా పోలీసు శాఖలో బదిలీలు జరిగినప్పుడల్లా.. రాజకీయ ఒత్తిళ్లు వస్తున్న ఫలితంగా మార్పులు చేసుకోవడం షరామామూలుగా మారడం గమనార్హం.

ఘనంగా మహా లింగార్చన



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధం శ్రీరామలింగేశ్వర స్వామికి మహాలింగార్చన నిర్వహించారు. రుద్ర నమకం, మాన్యసూక్తం, లక్ష్మీసూక్తం, పురుష సూక్తం పూజలు చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

అన్నదాతా.. రైతు వేదికకు రావా?

- కర్షకులను బతిమాలుకుంటున్న ఏఈవోలు
- సీఎం కార్యక్రమం కోసం ఏఈవోలకు టార్గెట్లు
- ప్రతీ ఆర్వీకి 200 మంది రైతులను తరలించాలని ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో 50 వేలకుపైగా రైతుల తరలింపు
- రైతులకు ఇచ్చే టీ, స్నాక్స్ డబ్బులు మాత్రం ఇవ్వరట
- మొన్నటి కార్యక్రమానికి పెట్టిన డబ్బులే రాలేదు



సాక్షిప్రతినిధి,కరీంనగర్:

రైతు వేదికల్లో ముఖ్యమంత్రితో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంతో ఏఈవో (అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్)లు ఇబ్బందులు పడుతున్నారు. సీఎం కార్యక్రమానికి రైతు వేదిక(ఆర్వీ)ల వద్దకు రైతులను తరలించాలని జిల్లా వ్యవసాయాధికారులు టార్గెట్లు విధించడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రతీ ఆర్వీలో కనీసం 200 మందికి తగ్గకుండా రైతులను తరలించాలని ఆదేశాల్లో స్పష్టం చేయడంతో ఏఈవోలు ఇప్పుడు అదే పనిలో తలమునకలయ్యారు. వాస్తవానికి ఈ కార్యక్రమానికి వచ్చేందుకు మెజారిటీ రైతులు సుముఖంగా లేరు. ప్రస్తుతం చాలా చోట్ల వ్యవసాయ పనులు మొదలవుతున్నాయి. మంగళవారం సాయంత్రం 5 గంటలకు సీఎంతో జరిగే ముఖాముఖిలో తప్పకుండా రైతుభరోసా లబ్ధిదారులతో మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 50 వేలమంది రైతులకు ఏఈవోలు ఫోన్లు చేసి కార్యక్రమానికి రావాల్సిందిగా బతిమాలుతున్నారు. మొన్నామధ్య రైతుభరోసా ప్రారంభం సందర్భంగా కూడా రైతులతో ముఖ్యమంత్రితో ఇలాంటి కార్యక్రమాన్నే నిర్వహించారు. అప్పుడు ప్రతీ ఏఈవోలకు నిర్వహణ ఖర్చుల కింద రూ. 5 వేలు చెల్లిస్తామని చెప్పారు. దీంతో ఆ కార్యక్రమంలో హాజరైన ప్రతీ రైతుకు టీ, స్నాక్స్‌ను ఏఈవోలే అందించారు. ఇందుకోసం వారే చేతి నుంచి డబ్బులు పెట్టుకున్నారు. ఆ డబ్బులు ఎపుడు వస్తాయా? అని ఎదురుచూస్తుంటే.. తీరా మరోసారి అలాంటి కార్యక్రమమే నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. చేసేది లేక మళ్లీ రైతులకు ఫోన్లు చేస్తూ.. చేతి చమురు వదిలించేందుకు సిద్ధమవుతున్నారు.

ఏఈవోలపై పనిభారం..

వాస్తవానికి ప్రతీ రైతు వేదికలో ఒకే ఒక ఏఈవో ఉంటారు. రైతులకు సంబంధించిన ప్రతీ విషయం వీరే చేసుకోవాలి. పంటలకు సంబంధించి ఎప్పటికపుడు రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడం. సాగులో సమస్యలు తలెత్తితే పరిష్కరించడం. పీఎం కిసాన్ యోజనకు సంబంధించి కేవైసీ డాక్యుమెంట్ల వెరిఫికేషన్, రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయడం, పంటల నమోదు చేయడం, రైతుబంధు, రైతు బీమా నమోదు, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి మట్టి నమూనాల సేకరణ తదితర పనులు ఉంటాయి. ఇవి కాకుండా రైతు వేదిక నిర్వహణ బాధ్యతలు కూడా చూసుకుంటారు. వీరు తప్ప మరే ఇతర సిబ్బంది లేకపోవడంతో వీరే ఉదయం వచ్చి రైతు వేదికను ఊడ్చుకోవాలి, కార్యక్రమాలు జరిగినపుడు కుర్చీలు వేయడం, వారికి టీ స్నాక్స్.. కూడా వీరే అందించాల్సి వస్తోంది. అధికారిక కార్యక్రమాలు జరిగినపుడు వచ్చిన వారంతా మరుగుదొడ్లను వినియోగిస్తున్నారు. తరువాత డబ్బులు ఇచ్చి వాటిని శుభ్రం చేయించుకోవాల్సి వస్తోంది. మొత్తానికి ఏఈవోలు నిర్వహించే ప్రతీ అధికారిక కార్యక్రమం ఇంట్లో చేసే శుభకార్యంలా ప్రతీది దగ్గరుండి చూసుకోవాల్సిన స్థితి. ఈ విషయమై పెద్దపల్లి జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డిని వివరణ కోరగా.. ఏఈవోలకు రైతుల తరలింపు విషయంలో ఎలాంటి టార్గెట్ విధించలేదని, వారే స్వచ్ఛందంగా వస్తున్నారని సమర్థించుకున్నారు.

జిల్లా	రైతు వేదికలు	ఏఈవోలు
కరీంనగర్	75	71
జగిత్యాల	52	71
పెద్దపల్లి	54	52
సిరిసిల్ల	57	53

రైతు వేదికల్లో ఇబ్బందులివీ!

- చాలాచోట్ల తాగునీరు సదుపాయం లేదు
- కుర్చీలు వేసే సిబ్బంది లేరు
- టీ, స్నాక్స్ ఇచ్చే దిక్కు లేదు
- మరుగుదొడ్లు శుభ్రం చేసే వారు లేరు
- రైతు వేదికకు కనీసం ఊడ్చే సిబ్బంది లేరు
- టెక్నికల్ ఎక్విప్‌మెంట్‌కు డబ్బులు రావు, నిర్వహణకు సిబ్బంది లేరు..

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్‌రూరల్: చొప్పదండి మండలం వెదురుగట్టకు చెందిన విష్ణువర్ధన్(29) బహదూర్‌ఖాన్‌పేట శివారులో ద్విచక్ర అదుపు తప్పి కింద పడడంతో మృతి చెందాడు. కరీంనగర్‌రూరల్ సీఐ ఏ.నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగునూర్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్న విష్ణువర్ధన్ సోమవారం వెదురుగట్ట నుంచి ప్రతిమ ఆసుపత్రికి వస్తుండగా మార్గ మధ్యలోని బహదూర్‌ఖాన్‌పేట వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి సమీపంలోని చెట్టుకు ఢీకొంది. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి పర్శరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



నగదు అందజేస్తున్న జర్నలిస్ట్ యూనియన్

హుజూరాబాద్: పట్టణానికి చెందిన ఓ న్యూస్ పేపర్ రిపోర్టర్ చిత్ర సుదర్శన్‌గౌడ్ (55) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. హుస్నాబాద్‌లో ఓ శుభ కార్యానికి హాజరై తిరిగి వస్తుండగా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామ శివారులో బైక్ అదుపు తప్పడంతో కందకంలో పడి మృతి చెందాడని. మృతుడి కుటుంబానికి తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.పదివేలు అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులను టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, చంద్రశేఖర్, హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, జర్నలిస్టులు పరామర్శించారు.

ఖైదీల యోగక్షేమాలు తెలుసుకున్న జడ్జి



జిల్లా జైలును తనిఖీ చేసిన జిల్లా జడ్జి శివకుమార్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా జైలును సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేశ్‌తో కలిసి సందర్శించారు. ఖైదీల యోగ క్షేమాలు, భోజన వసతులు, న్యాయసేవా, ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకున్నారు. క్యాంటీన్, ఆసుపత్రి, ములాఖత్, ఫోన్, లైబ్రరీ, వంటశాల, ఇండస్ట్రీలలో పనితీరు పరిశీలించారు. కొత్త చట్టాలు వివరించారు. మహిళా జైలును కూడా సందర్శించి కేసుల వివరాలు, బాగోగులు, సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. లాయర్లను పెట్టుకునే స్తోమత లేనివారికి ప్రభుత్వం తరఫున లాయర్లను నియమిస్తామని చెప్పారు. జైలు సూపరింటెండెంట్ విజయ డేని జైలర్లు పి.శ్రీనివాస్, బి.రమేశ్ తదితరులు ఉన్నారు.

ఎంపిక పోటీలకు వేళాయె!

- రేపటి నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రీడాపోటీలు
- టాప్ 20లో నిలిచిన బాలబాలికలు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు అర్హత
- సన్నాహాలు చేస్తున్న జిల్లా క్రీడాశాఖలు



, షటిల్ రన్ చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ క్రీడాపాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరంలో 4వతరగతిలో ప్రవేశాలకు గాను ఎంపిక పోటీల ప్రక్రియ ప్రారంభం కాగా.. తొలి అంకం మండల స్థాయి పోటీలను ముగించుకొని జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు సిద్ధమైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులు జిల్లాస్థాయి ఎంపిక పోటీలకు హాజరు కానున్నారు. సికింద్రాబాద్‌లోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో స్పోర్ట్స్ పాఠశాలలున్నాయి. జిల్లాస్థాయిలో శారీరక, సామర్థ్యానికి సంబంధించిన వాటితోపాటు పలు వాటిల్లో పరీక్షలను నిర్వహించి ఎంపిక చేస్తారు. జిల్లాస్థాయిలో టాప్ 20లో నిలిచిన బాలబాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా క్రీడాశాఖల అధికారులు ఎంపిక చేయనున్నారు.

జిల్లాస్థాయి పోటీల వివరాలు

ఈనెల 25, 26ల్లో కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో, 26న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల మైదానంలో, 26న జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో, 26న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రాజీవ్‌నగర్ మినీ స్టేడియంలో జరగనున్నాయి.

జిల్లాస్థాయిలో విద్యార్థులకు నిర్వహించే శారీరక సామర్థ్య పరీక్షలు

- ఎత్తు
- బరువు
- 30 మీటర్ల పెలైయింగ్ స్టార్ట్
- స్టాండింగ్ బ్రాడ్ జంప్
- 800 మీటర్ల రన్నింగ్
- 6.10 మీటర్ల షటిల్ రన్
- మెడిసన్ బాల్ త్రో(కిలో బరువు)
- వర్టికల్ జంప్
- ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ అండ్ మెడికల్ పరీక్షలు

సువర్ణావకాశం



క్రీడాకారులుగా ఎదగాలనుకునేవారికి స్పోర్ట్స్ పాఠశాలలు సువర్ణావకాశం. తెలంగాణ స్పోర్ట్స్ పాఠశాలల్లో చదివి అంతర్జాతీయస్థాయితోపాటు ఒలింపిక్స్ లాంటి మెగా ఈవెంట్లో పాల్గొని సత్తా చాటిన క్రీడాకారులు ఎందరో ఉన్నారు. క్రీడలతోపాటు విద్యపై కూడా శ్రద్ధ చూపుతారు.

– వేల్పుల సురేందర్, పెటా సంఘం అధ్యక్షుడు, పెద్దపల్లి

అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ



ఉన్నత, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణ స్పోర్ట్స్ స్కూల్‌లో దొరుకుతుంది. ఎన్ఎస్ఎన్ఐఎస్ చేసిన కోచ్‌ల ద్వారా శిక్షణ కార్యక్రమాలు ప్రతిరోజు జరుగుతాయి. అత్యుత్తమ శిక్షణనిస్తారు. క్రీడాకారులు వీటిలో ప్రవేశాలు పొందితే ఉన్నతంగా ఎదగడంతోపాటు దేశానికి, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చేలా ఎదుగుతారు.

– గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి

ఏర్పాట్లు పూర్తి



జిల్లాస్థాయి క్రీడాపాఠశాలల ఎంపిక పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈనెల 25, 26ల్లో రెండు రోజులపాటు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నాం. ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, కోచ్‌ల సహకారంతో విజయవంతంగా మండలస్థాయి ఎంపిక పోటీలు పూర్తి చేశాం. అదే స్ఫూర్తితో జిల్లాస్థాయి పోటీలను కూడా పూర్తి చేస్తాం.

– శ్రీనివాస్‌గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్

క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా..



రాష్ట్రంలో మేటి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా స్పోర్ట్స్ పాఠశాలలు ముందుకు సాగుతున్నాయి. క్రీడల్లో ఆసక్తి ఉన్నవారికి సువర్ణావకాశం. కేవలం క్రీడలకు అత్యంత ప్రాధాన్యముంటుంది. దేశ భక్తి పెంపొందుతుంది. దేశానికి పతకం సాధించాలన్న తపన, దేశ పతాకం ప్రపంచ వేదికల్లో రెపరెపలాడించాలన్న లక్ష్యాలతో ముందుకెళ్తారు.

– అజ్మీరా రాందాస్, డీవైఎస్‌వో, రాజన్న సిరిసిల్ల

సన్న బియ్యం అక్రమ రవాణా

- దళారులకు సహకరిస్తున్న డీలర్లు
- అడ్డూఅదుపు లేకుండా సాగుతున్న వ్యాపారం
- తనిఖీలు ముమ్మరం చేస్తున్న పౌర సరఫరాల శాఖ



గొల్లపల్లిలో పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం

గొల్లపల్లి: జిల్లాలో రేషన్‌బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వం సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తుండటం అక్రమార్కులకు అవకాశంగా మారింది. కొందరు డీలర్లు, వ్యాపారులు ముఠాగా ఏర్పడి బియ్యాన్ని అధిక ధరలకు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్కా లబ్ధిదారులు కూడా బియ్యాన్ని విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారని సమాచారం. గతంలో దొడ్డు బియ్యం సరఫరా చేసిన సమయంలో సాగిన అక్రమాలు ఇప్పుడు ఆగకపోవడంతో పౌరసరఫరాల శాఖ అధికారుల కన్నుగప్పి అక్రమార్కులు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు సమాచారం.

ఏళ్లుగా వేళ్లానుకుని..

రేషన్ బియ్యం అక్రమ రవాణా చాపకింద నీరులా విస్తరించింది. పేదల కడుపు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఈ బియ్యం పక్కదారి పడుతున్నాయి. దొడ్డు బియ్యం పంపిణీ సమయంలో లబ్ధిదారులు తినలేక డీలర్లు, ఇతరులకు అమ్మేవారు. ఇక కొందరు వ్యాపారులు రేషన్ షాపుల్లో మిగిలిన, లబ్ధిదారుల వద్ద సేకరించిన బియ్యాన్ని ప్రాసెస్ చేయించి అధిక ధరకు విక్రయించేవారు. కొందరు బడా వ్యాపారులు, మిల్లర్లు, ఇతరులనుంచి భారీ మొత్తంలో రేషన్ బియ్యం సేకరించి పాలిష్ చేయించాక విదేశాలకు ఎగుమతి చేశారు. కొన్ని సందర్భాలలో టాస్క్‌ఫోర్స్ బృందాలు బియ్యం లారీలను పట్టుకున్నా దందా ఆగలేదు.

సన్న బియ్యంతో చెక్‌పెట్టాలని..

గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయగా.. వాటిని తినేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్య తరగతి ప్రజలు అయితే బియ్యం అసలే తీసుకోలేదు. ఇదే అదునుగా బడా వ్యాపారులు జేబులు నింపుకున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులు కచ్చితంగా తింటారనే భావనతో ఉగాది నుంచి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. తొలినెలలో బియ్యాన్ని లబ్ధిదారులు అధిక సంఖ్యలో తీసుకెళ్లి తినడానికి వీలుగా ఉన్నాయని తెలిపారు. తద్వారా అక్రమ రవాణాకు చెక్ పడినట్లేనని పౌరసరఫరాల శాఖ అధికారులు భావించారు.

కఠిన చర్యలు తీసుకుంటేనే..

సన్నబియ్యం పక్కదారి పట్టకుండా పౌరసరఫరాల శాఖ కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే అధికారులు తనిఖీలు ముమ్మరం చేయడమే కాక లబ్ధిదారులు బియ్యాన్ని అమ్ముకున్నట్లు తెలిస్తే కేసు నమోదు చేయడమేకాక రేషన్ కార్డు రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే బియ్యం అమ్మిన, కొనుగోలు చేసిన వారిపై కేసులు పెడుతామని చెబుతున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. ప్రభుత్వం లక్ష్యం నెరవేరాలంటే తనిఖీలు ముమ్మరం చేయడంతోపాటు రేషన్ షాపులపై నిఘా పెట్టాలని పలువురు సూచిస్తున్నారు.

పక్కాగా పక్కదారి..

ప్రభుత్వం, అధికారుల అంచనాలను తలకిందులు చేస్తూ కొందరు వ్యాపారులు సన్నబియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది. మొదటి నెల పూర్తిగా లబ్ధిదారులు బియ్యం తీసుకోగా.. ఆ తరువాత నెల నుంచి సొమ్ము చేసుకోవడానికి అక్రమార్కులు ప్రయత్నాలు ప్రారంభించారు. గతంలో దొడ్డు బియ్యంతో రూ.లక్షలు కొల్లగొట్టిన వ్యాపారులు.. ఇప్పుడు సన్నబియ్యం కావడంతో ప్రణాళిక ప్రకారం పక్కదారి పట్టించే కుట్రకు తెరలేపారు. కొన్ని చోట్ల లబ్ధిదారులు తీసుకోకపోగా.. మిగిలిన సన్నబియ్యం ఇంకొన్ని చోట్ల లబ్ధిదారుల నుంచే నేరుగా సేకరించడం మొదలు పెట్టారు. దొడ్డు బియ్యం కన్న ఎక్కువ డబ్బు ముట్టచెబుతుండటంతో పలుచోట్ల లబ్ధిదారులు అమ్ముకుంటున్నట్లు తెలుస్తోంది. ఇలా సేకరించిన సన్న బియ్యాన్ని తరలిస్తుండగా జిల్లాలోని కొన్ని చోట్ల పోలీసులు పౌరసరఫరాల శాఖ అధికారులు సీజ్ చేశారు. ఇటీవలే 50 క్వింటాళ్ల సన్నబియ్యాన్ని తరలిస్తుండగా సివిల్ సప్లయ్ అధికారులు, పోలీసులు పట్టుకున్నారు. ఇవే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని తరలించినట్లు తెలుస్తోంది.

మహిళలు గర్వపడేలా చీరలుండాలి

- ఆత్మగౌరవంతో వాటిని కట్టుకోవాలి
- రాష్ట్రమంతటికి సిరిసిల్ల చీరలు
- సకాలంలో ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి
- రూ.150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి
- సిరిసిల్లలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఇందిరా మహిళాశక్తి చీరల బట్ట సేకరణను ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్

సిరిసిల్ల: రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులు ఆత్మగౌరవంతో కట్టుకునేలా సిరిసిల్ల నేతన్నలు నాణ్యమైన చీరలను ఉత్పత్తి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. సిరిసిల్ల ఏఎంసీ గోదాంలో సోమవారం ఇందిరా మహిళాశక్తి చీరల బట్ట సేకరణకు శ్రీకారం చుట్టారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నేతన్నలు, రైతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. గతంలో కంటే మెరుగైన ఆర్డర్లను ఇచ్చామని, సకాలంలో వస్త్రాన్ని ఉత్పత్తి చేసి సిరిసిల్ల పేరు నిలబెట్టాలన్నారు. వేములవాడలో రూ.50కోట్లతో నూలుడిపోను ఏర్పాటు చేసి 90 శాతం అరువుపై అందిస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికుల రూ.లక్షలోపు రుణాలు మాఫీ చేశామని పేర్కొన్నారు. నేతన్నలకు 4.30 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తి ఆర్డర్లు ఇవ్వగా.. ఇప్పటి వరకు 65 లక్షల మీటర్లు తయారు చేశారని, జూన్ నెలాఖరులోగా 50 శాతం పూర్తి చేయాలని సూచించారు.

రూ.150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి

వేములవాడ రాజన్న ఆలయాన్ని రూ.150కోట్లతో నాలుగు ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్నామని విప్ ఆది శ్రీనివాస్ వెల్లడించారు. ఇప్పటికే రూ.47.98కోట్లు కలెక్టర్ ఖాతాలో ఉన్నాయని, సిరిసిల్లలో పద్మశాలీ భవన్‌ను రూ.5కోట్లు, సిరిసిల్ల సంఘాల నుంచి మరో రూ.3కోట్లు సేకరించి రూ.8 కోట్లతో నిర్మిస్తామని, మార్కండేయ ఆలయాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ చీరల ఆర్డర్‌ను సకాలంలో పూర్తి చేయాలని, జూన్ నెలాఖరు నాటికి సగం ఆర్డర్ పూర్తి చేయాలని సూచించారు. సేకరణ పూర్తికాగానే ఉత్పత్తి చేసిన బట్టకు బిల్లులు అందుతాయని వెల్లడించారు. కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, చేనేత, జౌళి శాఖ జేడీ ఎన్.వెంకటేశ్వర్‌రావు, ఏడీ రాఘవరావు, డీడీ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు ఆకునూరి బాలరాజు, గడ్డం నర్సయ్య, ఆడెపు చంద్రకళ, కాముని వనిత, కల్లూరి చందన, వస్త్రోత్పత్తిదారులు ఆడెపు భాస్కర్, గోవిందు రవి, మంచె శ్రీనివాస్, కార్మిక నాయకులు మూషం రమేశ్, కోడం రమణ, మాజీ కౌన్సిలర్లు, జౌళిశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్‌లో పాల్గొనండి



ఇన్‌స్పైర్ అవార్డ్స్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

జగిత్యాల: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టడానికి, వారిలోని వినూత్న ఆలోచనలను బహిర్గతం చేసేందుకు ఇన్‌స్పైర్ అవార్డ్ మానక్ వేదికగా ఉంటుందని, ఇందులో విద్యార్థులందరూ పాల్గొనాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్‌కు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డుల కోసం నామినేషన్ వేయాలన్నారు. డీఈవో రాము మాట్లాడుతూ ప్రతీ పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులు రూపొందించాలని, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్‌కుమార్, కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఒలింపిక్ రన్ టార్చ్ ర్యాలీ



ర్యాలీలో క్రీడాకారులు

జగిత్యాల/మెట్‌పల్లి: ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా మెట్‌పల్లిలో ఒలింపిక్ రన్ టార్చ్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. ముత్తయ్య, అశోక్, కార్తీక్, గంగాధర్, క్రీడాకారులు పాల్గొన్నారు. అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం 2కే రన్‌లో పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో అదనపు కలెక్టర్ బీఎస్.లత పాల్గొన్నారు. క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, జిల్లా క్రీడల శాఖ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.



2కే రన్‌లో అదనపు కలెక్టర్ బీఎస్.లత

సింగరేణి పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు

యైటింక్లయిన్‌కాలనీ: మంచిర్యాల జిల్లా సీసీసీ–నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ సోమవారం తెలిపారు. కళాశాలలో మొత్తం 300 సీట్లు భర్తీచేస్తామన్నారు. సివిల్, కంప్యూటర్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్, మైని ంగ్ కోర్సుల్లో 60 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని, పాలిసెట్–2025లో ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల మూడో తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ పెట్టుబడులకు బినామీ కంపెనీలు

- జగిత్యాల జిల్లాలో మూతపడిన 8 కంపెనీలు
- రోడ్డున పడిన పెట్టుబడిదారులు
- వివాదాస్పద భూములు అంటగడుతూ ఆకర్షణ

జగిత్యాలక్రైం: ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే అధిక వడ్డీలు ఇస్తామని నమ్మించి జిల్లాలో పలువురి నుంచి రూ.కోట్లు వసూలు చేయడంతో చాలామంది రోడ్డునపడ్డారు. పెట్టుబడి పెట్టిన కొద్దిరోజులపాటు డాలర్ల రూపంలో వ్యాపారుల ఖాతాల్లో జమ చేసిన కంపెనీలు.. భారీ పెట్టుబడులు వచ్చిన తర్వాత మూసివేయడంతో చాలామంది పెట్టుబడిదారులు అయోమయంలో పడిపోయారు. కొన్ని కంపెనీలపై పెట్టుబడిదారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి కొంతమందిని అరెస్ట్ చేశారు. అలాంటి ఆన్‌లైన్ దందా రెండు నెలలుగా మళ్లీ జోరందుకుంది. ఆన్‌లైన్‌లో రూ.లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.18 వేల వడ్డీ ఇస్తామంటూ ఒక్కొక్కరి నుంచి రూ.లక్షకు తగ్గకుండా పెట్టుబడి పెట్టిస్తున్నారు.

రూ.10 లక్షలు పెట్టుబడితే 8 గుంటల భూమి

ఆన్‌లైన్ కంపెనీలు పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఆన్‌లైన్‌లో రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టిన వ్యక్తికి మల్యాల మండలం రాజారం, పోతారం శివారులో ఉన్న 8 గుంటల వివాదాస్పద భూమిని రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కొంత మంది ఆ భూమిపై నమ్మకం పెట్టుకుని పెట్టుబడి పెడుతున్నారు. మరికొందరిని కంపెనీ బ్యాంకాక్ వంటి దేశాలకు తీసుకెళ్తున్నాయి.

బాండ్ పేపర్ల బాధితుల కథ కంచికే..

గతంలో జిల్లాలో ఆన్‌లైన్‌లో పలు కంపెనీల్లో పెట్టుబడి పెట్టిన వారికి కంపెనీలు మూతపడటంతో మధ్యవర్తిగా ఉన్న పలువురు సుమారు రూ.10 నుంచి రూ.15 కోట్లకు బాండ్ పేపర్లు రాసిచ్చారు. మూడు నెలల్లో డబ్బులు చెల్లిస్తామంటూ హామీ ఇచ్చినా.. ఇప్పటివరకు వారికి నయా పైసా కూడా చెల్లించలేదు. వారే మళ్లీ బినామీ కంపెనీలు పెట్టి మళ్లీ పెట్టుబడిదారులను మోసం చేసేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.

పేద విద్యార్థి చదువుకు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎంఈవో, కన్వీనర్

ధర్మపురి: తల్లిదండ్రులను కోల్పోయిన ఓ నిరుపేద విద్యార్థిని బాసరలో ట్రిపుల్ ఐటీ చదువుకునేందుకు అయ్యే ఖర్చును భరించడానికి పలువురు ముందుకొచ్చారు. బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన గుండ నందిని బాసరలోని ట్రిపుల్ ఐటీలో రెండో సంవత్సరం చదువుతోంది. తల్లిండ్రులు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని బీర్‌పూర్ పాఠశాల పూర్వ విద్యార్థులు స్టూడెంట్ అడాప్షన్ ప్రోగ్రాం కన్వీనర్ గొల్లపెల్లి గణేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు విద్యార్థి దత్తత కార్యక్రమం కింద దత్తత తీసుకున్నారు. ధర్మపురికి చెందిన ఎన్నారైలు కొరిడె ఈశ్వర్, కొరిడె సాయి నందిని చదువు కోసం రూ.15వేల చొప్పున ఐదేళ్లపాటు చెల్లించేందుకు ముందుకొచ్చారు. మొదటి ఏడాదికి గాను రూ.15 వేలను ఎంఈవో సీతామహాలక్ష్మి చేతులమీదుగా అందించారు. దాతలకు, కన్వీనర్ గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పెండ్యాల మహేందర్, బీర్‌పూర్ పీడీ మంజుల ధరణి, ఉపాధ్యాయులు నర్సింహమూర్తి తదితరులున్నారు.

మహిళల అభివృద్ధికి స్వయం ఉపాధి యూనిట్లు



యూనిట్లను పరిశీలిస్తున్న ఏపీఎం గంగాధర్

జగిత్యాలరూరల్: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందిస్తోందని ఏపీఎం గంగాధర్ అన్నారు. జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని స్వయం ఉపాధి యూనిట్లను పరిశీలించారు. సెర్ప్, ఐకేపీ ద్వారా బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, గ్రామ సంఘాల ద్వారా మహిళా సంఘాల సభ్యులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఇందిరా మహిళాశక్తి యూనిట్లతో మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్న విధానం, భవిష్యత్ ప్రణాళికలపై సభ్యులకు అవగాహన కల్పించారు. హస్నాబాద్, అంతర్గాం, పొలాస, హైదర్‌పల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లో లక్‌పతి దీదీ యాప్ నమోదు, ఉల్లాస్ టాస్ నమోదు, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ సర్వే పరిశీలించారు. సీసీలు గంగారాం, రవీందర్, శ్రీనివాస్, మండల సమైక్య అధ్యక్షురాలు సత్తవ్వ, వీవోఏలు పాల్గొన్నారు.

27న పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్ 1డిపో నుంచి ఈనెల 27న వన్ డే టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ విజయమాధురి తెలిపారు. టూర్ ప్యాకేజీలో హైదరాబాద్‌లోని చిలుకూరు బాలాజీ, అనంత పద్మనాభ స్వామి, ఏడుపాయల దేవాలయం, అనంతగిరి హిల్స్‌ను సందర్శించేందుకు సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామని అన్నారు. 27న ఉదయం 4గంటలకు కరీంనగర్ నుంచి బయలుదేరి అదే రోజు రాత్రి 9గంటలకు తిరిగి కరీంనగర్‌కు చేరుకుంటుందని, పెద్దలకు రూ.1.430. పిల్లలకు రూ.900 టికెట్ ఉంటుందని తెలిపారు.

ఎడ్ల నాగలికి భలే గిరాకీ

- పసుపు విత్తనానికి రోజుకు రూ.3500కిరాయి
- ప్రతి గ్రామంలో ఐదారు జతల కాడెద్దులే దిక్కు



ఎడ్ల నాగలితో పసుపు విత్తనం వేస్తున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయంలో ట్రాక్టర్లు, ఆధునిక యంత్రాలు రావడంతో కాడెద్దులు కనుమరుగయ్యాయి. గ్రామానికి కేవలం ఐదారు జతల కాడెడ్లు మాత్రమే ఉన్నాయి. విత్తనాలు వేసే సమయంలో వాటికి భలే డిమాండ్ పెరిగింది. పసుపు వంటి విత్తనం వేసేందుకు కాడెడ్లతో వచ్చే రైతుకు రూ.3,500 నుంచి రూ.4వేల వరకు చెల్లించాల్సి వస్తోందంటే గ్రామాల్లో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

పోషణ భారమై..

ఒకప్పుడు గ్రామాల్లో ప్రతి రైతుకు కనీసం నాలుగైదు కాడెడ్లు ఉండేవి. జత కాడెడ్లు లేని రైతులు ఉండేవారు కాదంటే అతిశయోక్తికాదు. సాగులో ట్రాక్టర్ల రాకతో ప్రతి పనికీ యంత్రాలనే వినియోగిస్తున్నారు. చిన్న గ్రామంలోనూ సుమారు 20 నుంచి 30 ట్రాక్టర్లు వచ్చాయి. దీంతో కాడెడ్లను పోషించే స్తోమత రైతులకున్నా.. వాటికి నీరు పెట్టడం, మేత వేయడం వంటి పనులు చేయలేక అమ్ముకుంటున్నారు. నాలుగైదు ఎకరాలు ఉన్న రైతు కూడా ట్రాక్టర్ కొంటున్నాడు.

కాడెడ్లకు గిరాకీ

వాస్తవానికి విత్తనం వేసేందుకు కాడెడ్లు తప్పనిసరి. గతంలో ఇరుగుపొరుగు రైతులు అదలుబదలు రూపంలో విత్తనాలు వేసుకునేవారు. ప్రస్తుతం ఆ విధానం మారింది. కాడెడ్ల నాగలితో విత్తనం వేస్తే బాగా మొలకెత్తే అవకాశం ఉంటుంది. దీంతో పసుపు విత్తనం వేసేందుకు రైతులు కాడెడ్లపైనే ఆధారపడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎడ్ల నాగలితో వెళ్తే రూ.3,500 ఇస్తున్నారు. కొందరు రైతులు విత్తనం వేశాక అమ్ముకుంటున్నారు. కాడెడ్ల జతకు రూ.80వేల నుంచి రూ.90వేల వరకు ఉంది.

పసుపు వేసేందుకు..



వ్యవసాయంలో ట్రాక్టర్లతోనే అన్ని పనులు చేస్తున్నారు. ఆధునిక యంత్రాల రాకతో నాకున్న ఎడ్లను అమ్మిన. ఇప్పుడు పసుపు విత్తనం వేసేందుకు రూ.3,500 ఇస్తున్నాం. వారంముందే ఎడ్ల నాగలి మనిషికి అడ్వాన్స్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా గ్రామాల్లో రైతుల పరిస్థితి ఇలాగే ఉంది.

– గడ్డం గంగారెడ్డి, చల్‌గల్

ఎడ్లు దొరికే పరిస్థితి లేదు



ఎడ్ల నాగలితో విత్తనం వేస్తేనే బాగా మొలకెత్తుతుంది. ఇందుకోసం ఎడ్లు కొందామన్నా.. ఎక్కడా దొరికే పరిస్థితి లేదు. ఒక్కో జతకు రూ.80వేల పలుకుతోంది. విత్తనం వేసే వారంముందే ఎడ్ల నాగలిని కిరాయి తీసుకుంటున్నాం. మిగతా పనులు చేయడానికి ట్రాక్టర్ ఉపయోగిస్తాను.

– రాంకిషన్, వెల్దుర్తి